

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 95శాతం మంది హాజరు

**ఏలూరు అర్బన్:** ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెండోరోజు గురువారం ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లాలో 69 కేంద్రాల్లో ఉదయం జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 12,683 మందికి 11,992 మంది హాజరయ్యారు. 691 మంది గైర్హాజరయ్యారు. 95 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 11,225 మందికి 10,683 మంది హాజరయ్యారు. 542 మంది గైర్హాజరయ్యారు. అలాగే వృత్తి విద్యావిభాగంలో 1,458 మందికి 1,309 మంది హాజరుకాగా 149 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 1,637 మందికి 996 మంది హాజరు కాగా 156 మంది గైర్హాజరయ్యారు. 86 శాతం హాజరు నమోదైంది. సాధారణ విద్యార్థులు 1,152 మందికి 996 మంది హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 485 మందికి 420 మంది హాజరయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

# అటకెక్కిన రెగ్యులేటర్లు.. చెరువుల తవ్వకాలకు సన్నద్ధం..!

- కొల్లేరులో మూడుచోట్ల రెగ్యులేటర్ల నిర్మాణం బుట్టదాఖలు
- నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామని సిఎం చెప్పి ఏడాది
- నేటికీ ఓ కొలిక్కిరాని పరిస్థితి
- వేలాది ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలకు సన్నద్ధం
- బడాబాబులంతా కొల్లేరు ధ్వంసానికి సమాయత్తం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

**'కొల్లేరులోకి ఉప్పనీరు చేరుతోంది. కొల్లేరును కాపాడుకోవాలంటే మూడుచోట్ల రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టాలి. నిధులకు సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వచ్చే జూన్‌లో రెగ్యులేటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం' ఇవి 2022 మే 16వ తేదీన గణపవరంలో జరిగిన సభలో సిఎం చెప్పిన మాటలు. ఏడాది దాటేసింది. రెగ్యులేటర్ల నిర్మాణం అటకెక్కగా, ఇప్పుడు బడాబాబులంతా ఏకమై కొల్లేరును ధ్వంసం చేసేందుకు పూనుకున్నారు. వేలాది ఎకరాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల తవ్వకాలకు దిగారు. పరోక్షంగా ప్రభుత్వం, అధికారుల మద్దతుతోనే ఇది జరుగుతుందన్న ప్రచారం అందరినీ నివ్వెరపోయేలా చేస్తోంది.**


కొల్లేరు..

కొల్లేరులోకి సముద్రం నుంచి ఉప్పునీరు రాకుండా ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం పడితడక వద్ద, మొళ్లపర్రు గ్రామాల సమీపంలో మొత్తం మూడు రెగ్యులేటర్లు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం రూ.412 కోట్లు అంచనాలు తయారుచేసి ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీచేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామని 2022 మే 16న గణపవరంలో జరిగిన సభలో సిఎం చెప్పారు. రెగ్యులేటర్ల నిర్మాణంతోపాటు కొల్లేరులో భూముల రీసర్వే సైతం పూర్తిచేసి కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామని చెప్పారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి మరీ ప్రభుత్వం ధ్వంసం చేసింది. ఈ క్రమంలో జిరాయితీ భూముల్లోని చేపల చెరువులను సైతం ధ్వంసం చేసినట్లు కొల్లేరు ప్రజలు ఘొల్లుమంటున్నారు. కొల్లేరులో భూముల రీసర్వే జరిగితే పదివేల ఎకరాలకు వరకూ జిరాయితీ భూములు వస్తాయని అవి కొల్లేరు రైతులకు అప్పగిస్తే ఎంతగానో మేలు జరుగుతుందని అక్కడ జనం ఎదురుచూస్తున్నారు. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తిగా పక్కకు పెట్టేసిన పరిస్థితి నెలకొంది. రెగ్యులేటర్ నిర్మాణం, భూసర్వే వంటివి పక్కకుపోవడంతో కొల్లేరు ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇదేతరుణంలో కొల్లేరును పూర్తిగా ధ్వంసం చేసే ప్రక్రియకు బడాబాబులు దిగారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో చేతులు కలిపి అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలకు పూనుకుంటున్నారు.

**వేలాది ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలకు సన్నద్ధం**

ప్రజాప్రతినిధులు, బడాబాబులంతా ఏకమై కొల్లేరులో ఒక్కసారిగా వేలాది ఎకరాల్లో చేపల చెరువులను తవ్వాలని ప్రణాళికలు రచించినట్లు ప్రచారం సాగుతోంది. ఫారెస్ట్ అధికారులు సైతం వీరికి అండగా నిలుస్తుండటంతో అడిగే నాథుడే లేకుండా పోయాడు. ప్రభుత్వం సైతం అనధికారికంగా అనుమతులిచ్చినట్లు చర్చ సాగుతోంది. దీంతో రూ.కోట్లు చేతులు మారుతున్నట్లు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కొల్లేరులో తాగునీటి వనరులు పూర్తిగా కలుషితమయ్యాయి. తాగునీటి చెరువుల విస్తీర్ణం పెంపు చేసి కొల్లేరు ప్రజలకు తాగునీరు అందించాలని డిఆర్‌సి సమావేశంలో సైతం చర్చ జరిగింది. ఇప్పుడు అందుకు విరుద్ధంగా చేపల చెరువుల తవ్వకాలకు పూనుకుంటున్నారు. చేపల చెరువుల తవ్వకాలు జరిగితే రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తిగా అటకెక్కినట్లేనని చెప్పొచ్చు. కొల్లేరును పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న ప్రభుత్వ హామీలు సైతం బుట్టదాఖలు కానున్నాయి. చేపల చెరువుల తవ్వకాలతో పేదలకు ఉపయోగం లేదని, బడాబాబులకు కాసులు కురిపించే ఆలోచనతోనే ఈ వ్యవహారం సాగుతున్నట్లు చెబుతున్నారు. రెగ్యులేటర్ల నిర్మాణంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి కొల్లేరును కాలుష్యం నుంచి కాపాడాలని అంతా కోరుతున్నారు.

## 'ఉపాధి'ని దూరం చేసేందుకు కేంద్రం కుట్ర

ప్రజాశక్తి - పెనుమంట్ర


పెనుమంట్ర మండలంలో...

పేదలకు పట్టెడు అన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనుకుంటే సహించేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తీవ్రంగా ఖండించారు. గురువారం బ్రాహ్మణ చెరువు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని అంచలంచెలుగా తొలగించే ఉద్దేశంలో ఉన్నారన్నారు. ఈ క్రమంలో బడ్జెట్‌లో ఈ చట్టానికి భారీగా నిధుల్లో కోత విధించిందన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో కూలీలకు పనులేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పని చూపించి రూ.600 రోజు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టం యాప్ రద్దు చేయాలని, రెండు పూటల పని విధానాన్ని తొలగించాలని కోరారు. కనీసం పనిప్రదేశాల్లో


కాళ్లలో...

తాగునీరు, టెంటు, మజ్జిగ వంటివి ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని, పాత పద్దతిలోనే పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూనపూడి సుబ్బరాజు, చింతపల్లి అప్పారావు, చింతపల్లి లక్ష్మీకుమారి, లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం ఉపాధి హామీ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు.

**కాళ్ల:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో సరికొత్త నిబంధనలు తీసుకొచ్చి కూలీల కడుపు కొడుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, పూర్వపు జిల్లా కార్యదర్శి గొర్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కొండూరుగాలో చెరువు వద్ద పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, రామకృష్ణ మాట్లాడుతూ వడగాల్పులు విపరీతంగా పెరిగాయని, రెండు పూటలా ఫొటోల విధానం వల్ల ఉక్కపోతతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మర్ అలవెన్సులు నిలిపివేయడం దారుణమన్నారు. తాగునీరు, మజ్జిగ ఇవ్వడం లేదని, టెంట్లు ఏర్పాటు చేయడం లేదన్నారు. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని కనీస వేతనం రోజుకు రూ.600, 200 రోజులు పని కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.రాజకుమారి, కట్ట అలివేలక్ష్మి, మాగాపబత్తుల చినమ్మ, మార్తమ్మ, పి.కృష్ణ, పండూరి చిట్టిబాబు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం:** మండు వేసవిలోనూ పని ప్రదేశంలో చెట్ల నీడ, టెంట్లు లేకుండా పని చేస్తున్నామని, ప్రభుత్వం కూలీలను కనీసం పట్టించుకోవడం లేదని ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మోదుగుంటలో ఉపాధి పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ గతంలో కూలీల పని ప్రదేశాల్లో ప్రభుత్వం అందించిన టెంట్లు వేసుకునే వారమని, ఇప్పుడు టెంట్లు ఇవ్వడం లేదని, మండుటెండలో పనిచేస్తున్నా మజ్జిగ, తాగునీరు కూడా ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మూడు వారాల నుండి పని చేస్తున్నామని, వచ్చేవారం నుండి ఇక వారు వాపోయారు. చెరువుల్లో చేపల ఉదారుల చేతుల్లో ఉండటం వల్ల తమకు పని లేకుండా పోతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు కల్పించేలా పోరాడతామన్నారు. పనులు కల్పించని పక్షంలో చట్ట ప్రకారం నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దండ్రు వీరమ్మ, కారంకి దుర్గ, మండల కోట సత్యవతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

**పెనుగొండ:** ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టపరచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేవ, తాళ్లపాలెం, ములపర్రు, పితానివారిపాలెం, ఇలపర్రు, ఆఖోటుల దిబ్బ ప్రాంతాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను పరామర్శించి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా షేక్ పాదుషా మాట్లాడుతూ తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలు అరికట్టాలని ధర్నా

ప్రజాశక్తి - భీమవరం



ఆందోళన చేస్తున్న నాయకులు

పట్టణంలో వేళాపాళా లేని విద్యుత్ కోతలను అరికట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ ఏరియా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ కోతలు అరికట్టాలని కోరుతూ గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతలతో వృద్ధులు, చిన్నపిల్లలు ఉక్కపోతకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కోతలను అరికట్టి నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసి ప్రజలను ఎండల నుండి కాపాడాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను నుసమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, యాకోబు పాల్గొన్నారు.

## మిల్లర్లు అనధికార వసూళ్లు ఆపాలి : టిడిపి

**పాలకోడేరు:** ధాన్యంలో నూక శాతం పేరుతో రైతులను మిల్లర్లు దోపిడీ చేస్తున్నారని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆరోపించారు. మూడు రైస్ మిల్లులు రైతుల నుంచి అనాధికార వసూలుకు పాల్పడుతున్నారని, తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులపై మండిపడ్డారు. వేంద్రలో ధాన్యం కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీనిలో భాగంగా గురువారం గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎంఎల్ఎకి సమస్యలు వివరించారు. నూక శాతం పేరుతో మిల్లర్లు అన్యాయంగా దోపిడీ చేస్తున్నారని చెప్పారు. ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విష యంలో ప్రభుత్వం చెప్పేది ఒకటి క్షేత్రస్థాయిలో జరుగు తున్నది మరొకటన్నారు. మిల్లర్లు వసూళ్లకు పాల్పడకుండా ఉండేందుకు 40 కిలోల బస్తాకు బదులుగా 42 కిలోలు ఇవ్వాలని రైతులకు సూచిందన్నారు. కానీ కొన్ని రైసు మిల్లుల్లో ఇంకా అదనంగా నాలుగు నుంచి ఐదు కేజీలు అధనంగా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికా రులు మాత్రమే 40 కిలోల బస్తాకు బదులుగా 41 లేదా 42 కిలోల బస్తాలు ఇవ్వాలని సూచించారని గుర్తు చేశారు. అయినప్పటికీ మిల్లు యాజమాన్యాలు రైతులను ఇంకా దోపిడీ చేయడానికి చూస్తున్నాయన్నారు. రైతుల వద్ద అన్యా యంగా వసూలు చేసిన నగదు మొత్తాన్ని తిరిగి ఇవ్వకపోతే చర్యలు తప్పవన్నారు. మండలంలో రైతుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న మూడు రైసు మిల్లుల విషయాన్ని ఇప్పటికే ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అక్రమ వసూలుకు పాల్పడుతున్న మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. శృంగవృక్షం రైస్ మిల్లు ధాన్యం సేకరించడం లేదని, ఎంఎల్ఎ దృష్టికి తీసుకురావడంతో దీనిపై సమాధానం చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అధికారుల, రైతుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వేంద్రలో ఒక చెరువు కారణంగా తన పంట ఏటా దెబ్బతింటుందని వీరవల్లి త్రిమూర్తులు అనే రైతు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. పంటను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ షేక్ హుస్సేన్ ఆదేశించారు.

# వైద్య సేవల్లో గూడెం ఆసుపత్రికి ప్రథమ స్థానం

**మంత్రి కొట్టు సత్యనారాయణ**

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేదలకు వైద్య సేవలందించడంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం మంత్రి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖచే ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. దీనికిగాను కేంద్ర ప్రభుత్వం నుంచి రాబోవు మూడేళ్లపాటు సంవత్సరానికి ఒక్కో బెడ్‌కు రూ.పదివేలు అవార్డు కింద రానుందని, అలాగే లక్ష్యం విభాగంలో ఉత్తీర్ణత సాధించినందుకు గాను సంవత్సరానికి సుమారు లక్ష రూపాయలు చొప్పున మూడు సంవత్సరాల పాటు ఆసుపత్రికి అవార్డు కింద అందుతుందన్నారు. కాయకల్ప విభాగంలో రెండు విడతలుగా జరిగిన అసెస్మెంట్లో 94 శాతం సాధించినందుకు గాను అవార్డు కింద


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

నగదు మూడు సంవత్సరాల పాటు తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అందబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో కంటి చికిత్స విభాగానికి సంబంధించి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన పరికరాన్ని కొనుగోలు చేసేందుకు కమిటీ ఆమోదించింది. ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న జిల్లా స్థాయి వైరాలజీ ల్యాబ్‌లో థైరాయిడ్ పరీక్షలు కూడా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడి ఖాళీలను భర్తీ చేసేందుకు ఆరోగ్య మంత్రి కమిషనర్లతో మాట్లాడతానన్నారు. వైద్య సేవలను మెరుగుపర్చి సిబ్బందిని సమన్వయపర్చి ఆసుపత్రిని జిల్లాలో నెంబర్ వన్ స్థానంలో రావడానికి కృషి చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగడాల సూర్యనారాయణను మంత్రి కొట్టు సత్యనారాయణ అభినందించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ జిఆర్.రెడ్డి, కొలుకులూరి ధర్మరాజు, బోలెం రామలక్ష్మి, సిజిఎఫ్ మెంబర్, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ కర్రి భాస్కరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

# రామ్మోహన్‌రావు ధన్యజీవి

**సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం**

ప్రజాశక్తి - ఆచంట

తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసిన వాసా రామ్మోహన్‌రావు ధన్యజీవి అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సొసైటీ మాజీ మెంబర్ వాసా రామ్మోహన్‌రావు సంస్మరణ సభ ఆచంట వేమవరం రైస్‌మిల్లు రోడ్డులో గురువారం కొండేటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కష్టాలను ఎదుర్కొంటున్న ప్రజలకు ఎర్రజెండా ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. తుది శ్వాస విడిచే వరకూ పార్టీ కోసం పనిచేశారన్నారు. రామ్మోహన్‌రావు క్రమశిక్షణకు మారు పేరని తెలిపారు. చివరి వరకూ సిపిఎంలో కొనసాగి అందరిమన్ననలూ పొందారని గుర్తుచేశారు. ప్రజల కోసం పనిచేసిన నాయకులు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా మగ్గాల్లో నీరు చేరి నేతన్నలు ఇబ్బందులు పడుతుంటే వారి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

సమస్యలను జిల్లా అధికారులకు వివరించి పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన అకాల మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. సిపిఎం మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ కార్మికులను ఐక్యం చేయడంతో పాటు అనేక పోరాటాల్లో ముందుండి నడిపే వారిని కొనియాడారు. ఆయన ఆశయాలను అమలు చేయడమే రామ్మోహన్‌రావుకు ఇచ్చే నిజమైన నివాళని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ ఆచంట వేమవరంలో చేనేత కార్మికులతో మమేకమై కరుటూరి సత్యనారాయణతో కలిసి మెలిసి సమస్యల పరిష్కారానికి రామ్మోహన్‌రావు ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వర్ధిపర్తి అంజి బాబు, సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు, పరువు మోహన్‌రావు, కుసుమే జయరాజు, నాయకులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు, బొర్రా ధర్మారావు, తోటపల్లి సత్యనారాయణ తలుపురి బుల్లబ్బులు, గెద్దాడ వెంకటేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు గుడిమెట్ల రామలింగం, సిపిఐ గ్రామ కార్యదర్శి చల్ల వెంకట్ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక బ్రౌనింగ్ జూనియర్ కాలేజీలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అధికారులతో జిల్లా కలెక్టరు మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రంలో తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, అత్యవసర మందులు, ఒఆర్ఎస్


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్యాకెట్లను పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరు వెంట తహశీల్దార్ వై.రవికుమార్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఉన్నారు.

# మిల్లర్ల మోసాలను అరికట్టాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ధాన్యం తూకాల్లో మిల్లర్ల మోసాలను అరికట్టాలని ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు విమర్శించారు. గురువారం ఆయన జిల్లాలో పర్యటించి ధాన్యం కొనుగోలు, నూకశాతం పేరుతో తూకాల్లో మోసాలపై రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాముడూరులో పర్యటించి మాట్లాడుతూ నూకశాతం, తేమశాతం పేరుతో రైతులను మోసం చేస్తున్న మిల్లర్లను అదుపు చేయలేక పోవడం సిగ్గు చేటన్నారు. నిజంగా నూక శాతం పెరిగిన దానికి సరైన విధివిధానాలు ఇవ్వకుండా మిల్లర్లు రైతులు తేల్చుకోవాలని చెప్పడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కౌలు రైతుల చట్టంతో కౌలు కార్డులు అందక కనీసం ధాన్యం అమ్ముకునే పరిస్థితి కూడా లేదన్నారు. తక్షణం ఈ దోపిడీని అరికట్టి కౌలురైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, జిల్లా



రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

కార్యదర్శి ఎం.రామాంజనేయులు, కమిటీ సభ్యులు కె.గోపాలన్, పి.నాగరాజు, బి.శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

## నాగార్జునకు సత్కారం

**భీమవరం:** జిల్లా డిఐపిఆర్ కార్యాలయంలో సహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తున్న దాసరి నాగార్జున డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై కాకినాడ వెళుతున్న సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్లో ఎపిడబ్ల్యుజె (ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్) సత్కరించింది. ఎపిడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి వివిఎస్.సాయిబాబా మాట్లాడుతూ కొత్త జిల్లా ప్రారంభమైన తరువాత సమాచార శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తూ మీడియా ప్రతినిధులతో చక్కటి సన్నిహిత సంబంధాలు నెరిపి వివాదరహితులుగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవి.ప్రసాద్, యర్రంశెట్టి గిరిజాపతి, టివి9 శ్రీనివాస్, ఎబిఎన్ వర్మ, బోనం శ్రీనివాసు, సాయిబాబా, నూకల సత్యనారాయణ పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందిస్తున్న ఆర్‌డిఒ దాసి రాజు

## పేద విద్యార్థులకు చేయూతనందించాలి

**ఆర్‌డిఒ దాసి రాజు**

ప్రజాశక్తి - భీమవరం

ప్రతిభ కలిగి పేదరికంతో ముందుకు సాగలేని విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాలని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ ప్రతిభావంతులకు ప్రభుత్వం అనేక పథకాలతో సహకారాలు అందిస్తోందని తెలిపారు. 32 ఏళ్లుగా శ్రీవిజ్ఞానవేదిక ఎంతో మంది దాతల సహకారంతో ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇంటర్లో భీమవరంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 42 మంది విద్యార్థులకు ప్రతిభ ప్రోత్సాహక అవార్డులు, లయన్స్ క్లబ్, బార్ అసోసియేషన్ ఆర్థిక సహకారంతో మెడల్స్, ప్రశంసా పత్రాలను ఆర్‌డిఒ చేతుల మీదుగా అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, సతీమణి డాక్టర్ సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటరమణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, ఎస్ఆర్ కెఆర్ కళాశాల ప్రొఫెసర్ కె.మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

# పరిహారం.. పరిహాసం!


**ఇళ్ల స్థలాల కోసం భూములిచ్చిన రైతులకు అందని పరిహారం**

**15 రోజుల నుంచి లేఅవుట్‌లోనే నిరసన**

**స్పందించని అధికారులు**

ప్రజాశక్తి - పాలకోడేరు

సభ ఏదైనా, సాయం ఏ సామాజిక వర్గానికి అందిస్తున్నా ముఖ్యమంత్రి జగన్ పేదలపై అపారమైన ప్రేమ ఒలకబోస్తారు. నా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలంటూ, వారిపై తమ ప్రభుత్వానికే పేటెంట్ హక్కు ఉందనేలా మాట్లాడతారు. అదే పేద రైతుల నుంచి జగనన్న కాలనీల కోసమంటూ భూములు సేకరించి మూడేళ్లు గడుస్తున్నా పలువురికి పరిహారం చెల్లించకుండా ఆవేదనకు గురిచేస్తున్నారు. బాధిత రైతులు ర్యాలీలతో నిరసన తెలుపుతున్నా.. రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా పట్టించుకునేవారే లేరు. భూములిస్తే బతుకులు మార్చేస్తామని చెప్పి, ఇప్పుడు వారికి బతుకుతెరువే లేకుండా చేశారు.



జగనన్న లేఅవుట్లో పురుగుల మందు, పెట్రోల్‌తో నిరసన తెలియజేస్తున్న బాధితులు (ఫైల్‌ఫొటో)

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక 2020లో నవరత్నాల్లో భాగంగా అందరికీ ఇళ్లు పథకంలో మండలంలో 71.33 ఎకరాలు భూ సేకరణ చేశారు. మొదట విడతలో 16 లేఅవుట్లు, రెండో విడతలో 10 లే అవుట్లుగా విభజన చేసి 27,900 మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. దీనిలో భాగంగా పాలకోడేరు కోటిగట్టు ప్రాంతంలో 4.75 ఎకరాల భూమిని సేకరించి లేఅవుట్ ఏర్పాటుచేసి 184 మందికి పట్టాలిచ్చారు. ఈ 4.75 ఎకరాల్లో రెండకరాల భూమికి పరిహారం చెల్లించారు. మిగిలిన 2.74 ఎకరాల భూమి అసైన్డ్ భూమిగా పరిగణించి అధికారులు పరిహారం అందించలేదు. ఐదు దశాబ్దాల క్రితం కోటిగట్టు ప్రాంతంలోని మూడెకరాల ప్రభుత్వ భూమిని స్థానికంగా ఉన్న నిరుపేద రైతులకు అప్పటి ప్రభుత్వం కేటాయించి పట్టాలు మంజూరు చేసింది. కాలక్రమంలో పట్టాలు పొందిన రైతులు ఆ భూమిని క్రయవిక్రయాలు చేశారు. పిఒటి యాక్ట్ ప్రకారం పట్టా చేతులు మారడంతో ఎటువంటి నష్టపరిహారం అందించే వీలు లేదని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ అసైండ్ భూమి కొనుగోలు చేసిన ఒక రైతు మాత్రం కోర్టును ఆశ్రయించగా మిగిలిన నిరుపేద రైతులు నిరాశలుగా మిగిలారు.

**ఆర్థిక ఇబ్బందుల్లో నిరుపేద రైతు కుటుంబాలు**

జగనన్న స్థలాలకు భూములిచ్చిన రైతులు అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందిన వారు. 30 ఏళ్ల నుంచి రైతులు కారింకి సత్యనారాయణ, నల్లి రామలక్ష్మి, సంబలదీవి సాయిబాబు వారికి చెందిన 1.50 ఎకరాల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే 2020లో ఎకరానికి రూ.66 లక్షలు చొప్పున అందిస్తామని చెప్పి వారి నుంచి అధికారులు భూములు తీసుకున్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా చిల్లి గవ్వ కూడా నష్టపరిహారం చెల్లించలేదు. ఈ మూడు కుటుంబాల రైతులు పరిహారం కోసం కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు మాత్రం ఎస్సైన్డ్ భూమికి పిఒటి యాక్టు ప్రకారం పరిహారం రాదని స్పష్టం స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న నిరుపేద రైతులు అటు ఆర్థికంగానే ఇటు మానసికంగా కుంగిపోయారు. సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించింది. రామలక్ష్మి భర్త పరిహారం రాదని మనోవేదనతో ఇటీవల మృతి చెందాడు. ఏళ్లు గడుస్తున్నా పరిహారం రాకపోవడంతో ప్రభుత్వానికి ఇచ్చిన భూమిలోనే ఆందోళనకు దిగారు. పెట్రోలు, పురుగుల మందు డబ్బాలను పట్టుకుని లేఅవుట్‌లోనే ఆత్మహత్యకు పాల్పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బాధితులకు అండగా సిపిఎం, వ్యకాస**

బాధితులకు సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘాలు అండగా నిలిచాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాకు అక్రియ్య బాధిత రైతులను పరామర్శించి వారి ఆందోళనకు మద్దతు తెలిపారు. బాధిత రైతులతో కలిసి ఆందోళనకు ప్రణాళిక రూపొందించడంతో భూ నష్టపరిహార సాధన ఉద్యమ కమిటీని ఏర్పాటు చేసి మిగిలిన రాజకీయ పార్టీలైన టిడిపి, జనసేనలను ఆందోళనలో భాగస్వామ్యం చేశారు. ఇంట్లో భాగంగా ఇటీవల పాలకోడేరులో పాదయాత్ర నిర్వహించి తహశీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి తహశీల్దార్ షేక్ హుస్సేన్‌కు సమస్యను వివరించారు. బాధిత రైతు కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని ఉద్యమ కమిటీ స్పష్టం చేసింది.

### అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగా..

**కారంకి సత్యనారాయణ, బాధిత రైతు, పాలకోడేరు**



2020లో ఇళ్ల స్థలాలకు మా భూమి ఇవ్వాలంటూ అధికారులు సంప్రదించారు. భూమి ఇచ్చినందుకు పరిహారం ఇస్తామని చెప్పారు. చివరకు అది అసైన్డ్ భూమని చెప్పి నష్టపరిహారం ఇవ్వలేదు. నా కుటుంబానికి ఎక్కడా ఒక్క సెంటు భూమి కూడా లేదు. భార్య, 10 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమారులతో కాయకష్టం చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. అనారోగ్యం కారణంగా రెండేళ్లుగా కూలి పనులకు వెళ్లలేకపోతున్నా. ప్రభుత్వం ఇచ్చే పరిహారమే నా కుటుంబానికి ఆధారం.

### మనో వ్యథతో నా భర్త మృతి చెందారు

**నల్లి రామలక్ష్మి, బాధిత రైతు, పాలకోడేరు**



రూ.42 లక్షలు నష్టపరిహారం ఇస్తామని అప్పటి తహశీల్దార్, విఆర్ఒలు నా భర్తను నమ్మించి సంతకాలు చేయించుకుని మోసం చేశారు. నష్టపరిహారం కోసం నా భర్త నల్లి పెద్దులు కార్యాలయాలకు తిరితిరి అలసిపోయి మనో వ్యథతో మృతి చెందారు. నాకు, నా కుమారుడికి ఈ భూమే జీవనాధారం. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇవ్వాలి. లేకపోతే ఆత్మహత్య శరణ్యం

### ఇంత చిన్నచూపా..

**సంబలదీవి సాయిబాబు, బాధిత రైతు, పాలకోడేరు**



పేద రైతులు కాబట్టి భూములు తీసుకుని మోసం చేశారు. భూస్వాముల నుంచి అయితే భూములు తీసుకోగలరా. తీసుకున్న భూమికి నష్టపరిహారం ఇమ్మని అడుగుతుంటే వట్టించుకోవట్లేదు. రైతులంటే ప్రభుత్వానికి ఇంత చిన్నచూపా. తక్షణం పరిహారం అందించి మమ్మల్ని ఆదుకోవాలని.

### ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది

**జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, భీమవరం**



పేదలకు ఇళ్ల స్థలాలివ్వడం అభినందనీయం. ఇళ్ల స్థలాలకు పేద రైతుల నుంచి భూములు తీసుకుని పేదలకు కేటాయించడం దారుణం. రైతుల పట్ల ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. ఇళ్ల స్థలాలకు భూమిలిచ్చిన ముగ్గురు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. భూస్వాములు వదిలేసి పేద రైతుల దగ్గర ఉన్న చిన్నా చతక భూములు తీసుకోవడం దుర్మార్గం. పరిహారం ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.

## నేటి నుంచి వికలాంగుల క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్ర వికలాంగుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక డిఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకూ డాక్టర్ కరుమూరి వికలాంగుల ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ, డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోర్ కమిటీ మెంబర్ ఎన్.మధుసూదన్ నాయక్ సంయుక్తంగా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో సెంట్రల్ జోన్, నార్త్ జోన్, సౌత్ జోన్ కరుమూరి లెవెన్ జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. 28వ తేదీన జరిగే బహుమతుల ప్రదానోత్సవానికి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, పట్టణ ప్రముఖులు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

## నేడు 'వాలంటీర్లకు వందనం'

ప్రజాశక్తి - పెనుమంట్ర

సాయినాథ్ కళ్యాణ మండపంలో ఈ నెల 26 తేదీన వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల్లో పని చేస్తున్న వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు చేతుల మీదుగా అవార్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## కిషోర్ కుమార్‌కు ముఖ్యమంత్రి పరామర్శ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మృత్యుంజయ సొసైటీ ఛైర్మన్ వైట్ల శారదా దేవి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం విధేయతమే. అయితే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో మూడో విడత జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైట్ల కిషోర్ కుమార్ తల్లి శారదా దేవి మరణ వార్తను వైసిపి నాయకులు అరిగెల సురేష్ బాబు ముఖ్యమంత్రికి తెలుపారు. ఆయన స్పందించి ఫోన్లో కిషోర్ కుమార్‌తో మాట్లాడి పరామర్శించారు. ధైర్యంగా ఉండండి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్లు కార్యకర్తలు తెలిపారు.



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

## రోహిణీ కార్తె వచ్చేసింది..

### ఎండ తీవ్రతతో జనం ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి - పాలకొల్లు

రోహిణీ కార్తె తొలిరోజు గురువారం ఎండ ప్రభావం తీవ్రంగా ఉంది. ఎండ మధ్యాహ్నం ఎక్కువగా ఉండటంతో పట్టణంలో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. దీంతో వ్యాపారులు మధ్యాహ్నం షాపులు మూసివేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు సెలవు రోజులా వెలవెల బోతున్నాయి. ఎండతీవ్రత, ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.


## 29న యానిమేటర్ల ధర్నా

**గణపవరం:** డ్వాక్రా యానిమేటర్ల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29న గణపవరం వెలుగు కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి పి.గోవిందు అన్నారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన మండల యానిమేటర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి తోట పద్మావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ రకరకాల నిబంధనల పేరుతో యానిమేటర్ల పోస్టులు తొలగించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. సమస్యల పరిష్కరించాలని నిర్వహించే ధర్నాలో యానిమేటర్లు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎలిపే సుజాత, రత్నమాణిక్యం, ఝాన్సీ పావని పాల్గొన్నారు.

## నిరంతర సేవే మానవత లక్ష్యం

ప్రజాశక్తి - తణుకు

నిరంతర సేవే మానవత లక్ష్యమని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి అన్నారు. గురువారం స్థానిక రోటరీ క్లబ్‌లో మానవత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవత చేస్తున్న సేవా కార్యక్రమాలకు స్పందించి హైదరాబాద్‌కు చెందిన షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ అధినేత ఎం.విశ్వేశ్వరరెడ్డి సిఎస్ఆర్ ఫండ్స్‌లో భాగంగా కోటి రూపాయల విరాళాన్ని సెంట్రల్ కమిటీ ఛైర్మన్ ఎన్.రామచంద్రారెడ్డికి అందజేశారు. ఈ విరాళాల మొత్తాన్ని నిబంధనలకు లోబడి యూనిట్ల అభివృద్ధికి వినియోగించాలని విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారన్నారు. జిల్లా సెంట్రల్ కమిటీ డైరెక్టర్ గమిని రాంబాబు మాట్లాడారు. ఈ సమావేశంలో మండల కో ఛైర్మన్ రామకృష్ణ, కన్వీనర్ ఎస్‌వి.సతీష్‌బాబు, ఉపాధ్యక్షులు ఎ.బాలాజీ సభ్యులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న పివిఎల్

## వాలంటీర్ల సేవలు అభినందనీయం

**కాళ్ల:** వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. ఏలూరుపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాలంటీర్లను గురువారం సత్కరించారు. కలవపూడి, జువ్వలపాలెం, మాలవానితిప్ప, ప్రాతళ్లమెరక, ఏలూరుపాడు, 1, 2 గ్రామ సచివాలయాల వాలంటీర్లకు గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలకు సేవా మిత్ర - సేవారత్న సేవా వజ్ర పురస్కారాల ప్రదానోత్సవం చేశారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఎస్.ప్రభాకర్, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, కలవపూడి సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స ప్రసాదరాజు, సర్పంచులు భూపతిరాజు జగ్గరాజు, ఎంపిటిసిలు రాంబాబు, మీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా మట్టి రవాణా!

### రోడ్లపైనే మట్టి, పట్టని అధికారులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దీనికి రక్షణ చర్యలు చేపట్టకుండా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ నిండా వేసేయడంతో రవాణా సమయంలో మట్టి గడ్డలు రహదారిపై పడుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముత్యాలపల్లి, వారతిప్ప, మొగల్తూరు తదితర గ్రామాల్లో మట్టి రవాణా యథేచ్ఛగా పగలూ రాత్రి తేడా లేకుండా సాగుతోంది. సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తిన చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వాహనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## మహానాడును విజయవంతం చేయండి

### టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలోని వేమగిరి దగ్గర నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతన నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ 27న నిర్వహించే ప్రతినిధుల మహాసభకు ముఖ్య నాయకులు పాల్గొంటారని చెప్పారు. 28న మహానాడు బహిరంగసభకు ప్రజలందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు. నరసాపురం పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి లక్షా 25 వేల మంది తరలివెళ్లనున్నారని తెలిపారు. భీమవరం నియోజకవర్గం నుంచి ప్రయివేటు బస్సులు, కార్లు, ఆటోల ద్వారా సుమారు పదివేల మంది మహానాడు సభకు హాజరవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ, డ్వాక్రా సంఘాల ప్రధాన కార్యదర్శి మేరగని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేంద్ర శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** రాజమండ్రిలోని వేమగిరి వద్ద ఈ నెల 28న జరగనున్న మహానాడుకు అందరూ తరలిరావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో మహానాడు సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి తాడేపల్లిగూడెం నుండి 50 బస్సులు, 200 కార్లు, మోటార్ సైకిళ్లపై పార్టీ శ్రేణులను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, కీలపర్తి వెంకట్రావు, పాతురి రాంప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల 23వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వివిధ క్రీడా సాంస్కృతిక పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సభ అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఆదాల విష్ణువర్ధన్ రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ బోధనా బోధనేతర సిబ్బంది, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## అన్నదాతల కష్టం.. దళారుల పాలు

ప్రజాశక్తి - ఆచంట

అన్నదాతల కష్టం దళారీల పాలవుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. గురువారం ఆచంట వేమవరం పంచాయతీ పరిధి వేమవరం, పడమటిపాలెంలో పర్యటించి ఆయన ధాన్యం రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో నూకశాతం సాకుతో రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారని, అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం మాసూలు చేసి 20 రోజులు కావస్తున్న సంచుల కొరత అధికంగా ఉందన్నారు. గోనె సంచులు లేకపోవడంతో ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు తరలించడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలులో నూకశాతం పేరుతో మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలన్నారు. రైతుల నుంచి అదనపు కిలోల ధాన్యం వసూలను తక్షణం అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులు ధాన్యాన్ని అమ్ముకునే క్రమంలో ఎక్కువగా నష్టపోతున్నారని వాపోయారు. ఈ సీజన్లో 40 కేజీలకు బదులు 42, 43 కేజీలు అదనంగా ధాన్యాన్ని తీసుకెళ్తున్నారని తెలిపారు. దీంతో రెండు మూడు కేజీల వరకూ అదనంగా తూచి వ్యాపారులు దోచుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని అదనపు ధాన్యం వసూలును ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, నాయకులు కొండేటి సత్యనారాయణ, సిర్రా నరసింహమూర్తి, వర్ధిపర్తి అంజిబాబు పాల్గొన్నారు.



ఆచంట వేమవరంలో రైతులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

## కొనసాగిన వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో గురువారం వైఎన్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ పొన్నాడ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు కెమిస్ట్రీ తరగతులు నిర్వహించారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేసి, రసాయన శాస్త్రం గురించి వివరించారు. పీరియాడికల్ టేబుల్స్ తెలిస్తేనే గాని కెమిస్ట్రీ క్లాస్ అర్థం కాదన్నారు. ముందుగా బేసిక్స్ తెలుసుకోవాలని, హైడ్రోజన్ తదితర వాటి గురించి వివరించారు. అనంతరం బార్క్ శాస్త్రవేత్త సుబ్బారావు కాంతి సంవత్సరం కాంతి వేగం విషయాలపై అవగాహన కల్పించారు. స్కూల్ అసిస్టెంట్ సిహెచ్ శ్రీనివాస్ పిల్లలకు నీతి కథలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుధీర్ మోహన్, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.



వృద్ధులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## షుగర్ వ్యాధిగ్రస్తులు కంటి పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

షుగర్ వ్యాధిగ్రస్తులు రెండు నెలలకోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని పిప్పర పిహెచ్‌సి డాక్టర్ కె.ప్రియాంక అన్నారు. గురువారం సిహెచ్ అగ్రహారంలో వైఎస్ఆర్ కంటి వెలుగు ఆయన పాల్గొని మాట్లాడారు. తమ ఆసుపత్రి పరిధిలో గ్రామాల్లో కంటివెలుగు ఏర్పాటు చేసి వృద్ధులకు ఉంచితంగా కంటి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచి చుక్కా అప్పారావు మాట్లాడుతూ వైఎస్ఆర్ కంటి వెలుగులో భాగంగా స్థానికులు ఉచితంగా పరీక్షలు చేయడం హర్షం వ్యక్తం చేశారు. 71 మంది వృద్ధులకు పరీక్షలు చేయగా అందరికీ కళ్లజోళ్లు పడతాయని నేత్ర వైద్యులు శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పెచ్చెట్టి శివనారాయణ, గణపవరం. సిహెచ్ జాలాది విల్సన్ బాబు పాల్గొన్నారు.

## సమస్యలను మహానాడులో ప్రదర్శిస్తాం

### ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలోనే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో 2,36,442 సమస్యలు వచ్చాయని, ఈ సమస్యలను రాజమండ్రిలో జరిగే మహానాడులో ప్రదర్శిస్తున్నట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఒక్క పాలకొల్లులోనే ఇన్ని సమస్యలుంటే రాష్ట్రంలో కోట్ల సమస్యలు ఉంటాయన్నారు. జగన్ చెబుతున్నట్లు 175 స్థానాల సంగతి ఎలా ఉన్నా పులివెందులలో కూడా జగన్ ఓడిపోతారని ఆయనకు తెలుసన్నారు. ఈ సమస్యలను జగన్ పరిష్కరించలేరని రాబోయే టిడిపి ప్రభుత్వంలో పరిష్కరిస్తామని చెప్పారు. పట్టణంలో టిడ్కో గృహాలు టిడిపి 85 శాతం పూర్తి చేస్తే ఈ ప్రభుత్వం వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ పూర్తి చేసి ఇవ్వలేదని తెలిపారు.

## 'జనసేన విజయానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

రానున్న ఎన్నికల్లో జనసేన విజయానికి జన సైనికులు కృషి చేయాలని పార్టీ నరసాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ సూచించారు. గురువారం సాయంత్రం కాళీపట్నం తూర్పులో జనసేన మండల అధ్యక్షులు కొల్లాటి గోపీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను దత్తపుత్రుడని వ్యాఖ్యానించిన చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, మండల కార్యవర్గ సభ్యులు, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఆనంద ప్రకాష్ పుట్టినరోజు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్ ప్రకాష్ పుట్టిన రోజు గురువారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గుణ్ణం నాగబాబు, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజులు పాల్గొన్నారు.

## పనులు త్వరగా పూర్తి చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతంలో డ్రెయినేజీ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఎంఎల్ఎ చెరుకువాడ రంగనాథరాజు ఆదేశించారు. గురువారం శ్రీరంగనాథరాజు సిద్ధాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధాంతం డ్రెయినేజీ సమస్యను త్వరగా పూర్తి చేయాలన్నారు. సిద్ధాంతం రోడ్డు గుండా ఆక్రమణలను తొలగించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ, పోలీస్ సిబ్బంది, ఎంపిటిసి ఏడుకొండల పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు